క్లుప్తంగా

జోన్ - 2 కమిషనర్‌గా లక్ష్మి



మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ కమిషనర్‌గా దాట్ల లక్ష్మి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడ పనిచేసిన కొట్యాడ కనక మహాలక్ష్మి మెయిన్ ఆఫీసుకు ఏవోగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో లక్ష్మి బాధ్యతలు చేపట్టారు. ఈమె మెయిన్ యూసీడీ విభాగం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

యూజీడీ వ్యవస్థ పరిశీలన



యూజీడీని పరిశీలిస్తున్న పల్లా దుర్గారావు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పితాని వీధి, బంగారమ్మ గుడి ప్రాంతంలో యూజీడీ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తానని వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తెలిపారు. మంగళవారం వార్డులోని పలు ప్రాంతాలలో సందర్శించి ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇక్కడి యూజీడీ వ్యవస్థను పరిశీలించారు. లీకేజీలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో యూజీడీ ఎస్ఈ రవి, ఏఈ కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జీవన్ పాల్గొన్నారు.

'సామాజిక వాస్తవికత' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాంగోపాల్

బీచ్ రోడ్డు: ఆచార్య వెలమల సిమ్మన్న రాసిన కారా కథలు సామాజిక వాస్తవికత అనే పుస్తకాన్ని ఆకాశవాణి విశాఖపట్నం విభాగాధిపతి పి.వి.రాంగోపాల్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారా కథల వైవిధ్యాన్ని విశిష్టతను వివరించారు. కారా రాసిన సంకల్పం కథ చాలా గొప్పదని కొనియాడారు. ఆచార్య సిమ్మన్న ఈ పుస్తకాన్ని ఆకాశవాణి పూర్వ అనౌన్సర్ డాక్టర్ కానేటి మధుసూదన్‌కి అంకితం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు విభాగం విశ్రాంత ఆచార్యులు సుదర్శన్ రాజు, ఉప్పల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

బీవీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా వంకాయల తాతాజీ



అల్లిపురం: భారత వికాస్ పరిషత్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడిగా 2024–26 సంవత్సరానికి గాను నగరానికి చెందిన శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ)ని ఎన్నుకున్నారు. ఈ మేరకు తునిలో జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో బీవీపీ కమిటీ సభ్యులు కార్యవర్గ సభ్యులు వీరిని ఎన్నుకున్నట్లు బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి రమేష్ చంద్ జైన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రాంతీయ స్థాయి ప్రతినిధి ఎంవీవీ సత్యనారాయణ, ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, విశాఖపట్నం నగర శాఖ అధ్యక్షుడు పి. వెంకటేశ్వరరావు, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి మాణిక్యాలరావు, ఎన్‌జీఎస్సీ కన్వీనర్ సీహెచ్‌వీ సత్యనారాయణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూల సోయగం



సాగరతీరంలో కాలువ కనిపించకుండా ఏర్పాటు చేసిన పూల కుండీల అలంకరణ

- వివిధ పూల ఆకృతులతో సుందరంగా ప్రధాన కూడళ్లు
- కాలువల వద్ద కూడా ప్రత్యేక డెకరేషన్‌తో ముస్తాబు

బీచ్ రోడ్డు: విభిన్న వర్ణాల పూల పరిమళం.. మొక్కల సోయగం.. చూడచక్కని అందమైన కుండీలు నగరంలో ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. ఆర్కే బీచ్ వైపు వెళ్లే మార్గంలో సిరిపురం సర్కిల్, పోర్టు గెస్ట్ హౌస్, పార్క్ హోటల్ సర్కిల్ ప్రాంతాలలో వివిధ ఆకృతులతో కూడిన మొక్కలు కనువిందు చేస్తున్నాయి. సుందరమైన విశాఖ నగరానికి.. అందమైన తీరానికి నిరంతరం సందర్శకులు వేల సంఖ్యలు వస్తుంటారు. వారిని ఆకర్షించేలా రహదారులకు ఇరువైపులా, అలాగే



పోర్టు గెస్ట్ హౌస్ వద్ద అలంకరణ

నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద పలు మొక్కలు ఏర్పాటు చేశారు. హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ అధికారులు ఇందు కోసం గత రెండేళ్లలో సుమారు రూ. 50 లక్షలు ఖర్చు చేశారు.

కాలువలకూ ప్రత్యేక డెకరేషన్

పర్యాటక ప్రాంతాలకు వెళ్లే మార్గంలో ఉన్న కాలువలు, డ్రైనేజీల కారణంగా పర్యాటకులు అసౌకర్యానికి గురికాకుండా చర్యలు చేపట్టారు. కాలువలు కనిపించకుండా ప్రత్యేకంగా డెకరేషన్ చేశారు. చిన్నపాటి మొక్కలతో అందమైన గోడను నిర్మించి ముస్తాబు చేశారు. దీంతో అక్కడ కాలువ ఉన్నట్లు కూడా ఎవరికి తెలియదు. పైగా అక్కడికి వెళ్లి సందర్శకులు సెల్ఫీలు కూడా తీసుకునేలా ఏర్పాట్లు చేశారు. మరోవైపు సాగరతీరంలో ఏర్పాటు చేసిన మొక్కలను పశువులు తినకుండా రక్షణ చర్యలు కూడా చేపట్టారు. దీంతో నిరంతరం పచ్చదనంతో కూడిన ఆహ్లాదకరమైన వాతావరణం సందర్శకులకు అందుబాటులో ఉంటోంది.



సిరిపురం నుంచి బీచ్‌కు వెళ్లే కూడలిలో..



తీరంలో మొక్కలకు భద్రత

నగరాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయం



రోడ్డు, బ్రిడ్జి ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

- మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ
- 12వ వార్డులో డబుల్ రోడ్డు, వంతెన ప్రారంభం

ఆరిలోవ: నగరాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 12వ వార్డులో నిర్మించిన డబుల్ రోడ్డు, బ్రిడ్జి అందుబాటులోకి వచ్చాయి. వీటిని మంగళవారం మేయర్ గొలగాని, ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ అక్కరమాని రోహిణి ప్రారంభించారు. జీవీఎంసీ ఇటీవల బీఆర్‌టీఎస్‌లో చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం కూడలి నుంచి సూర్యతేజానగర్ వరకు డబుల్ రోడ్డు, సూర్యతేజానగర్, పార్వతీనగర్ మధ్య పెద్ద గెడ్డపై బ్రిడ్జి నిర్మించిన విషయం తెలిసిందే. వాటి ప్రారంభోత్సవం అనంతరం మేయర్ గొలగాని, విశాఖ ఎంపీ ఎంవీవీ మాట్లాడుతూ రూ 2.35 కోట్ల నిధులతో రోడ్డు, రూ.3 కోట్ల నిధులతో బ్రిడ్జి నిర్మించినట్టు తెలిపారు. ఇక్కడ ఇంత వరకు ఇరుకుగా ఉండడంతో వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉండేదన్నారు. రోడ్డు, బ్రిడ్జిని కొత్తగా నిర్మించడంతో ఆ సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇక్కడ రోడ్‌డ్ విస్తరణ, బ్రిడ్జి నిర్మాణం చేపట్టలేకపోయాయన్నారు. ఇప్పుడు వీటి నిర్మాణంతో ఆరిలోవ ప్రజలకు ఎంతో మేలు జరిగిందన్నారు. వీటితో పాటు పెదగదిలి, తోటగరువు మధ్యలో గెడ్డపై బ్రిడ్జి నిర్మాణం పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీకి సమస్యలు వివరిస్తున్న నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ సభ్యులు

ఎంవీపీ కాలనీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ విశాఖపట్నం జిల్లా రీజయన్ కమిటీ ప్రతినిధులు ఎంపీ ఎంవీవీ సత్యనారాయణను కోరారు. ఈ మేరకు లాసన్స్ బే కాలనీలోని ఎంపీ కార్యాలయంలో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. గత 20 రోజులుగా రీజనల్ మేనేజర్ కార్యాలయం ఎదుట నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా విశాఖ డీపీటీవో స్పందించడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు అందకుండా చేస్తున్నారని, 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయడం లేదని, గ్యారేజీ వారికి స్పేర్స్ టూల్స్ ఇవ్వడం లేదని, సిక్‌లకు జీతాలు చెల్లించడం లేదని, ఐఐటీలతో అక్రమంగా కేసులు రాయించి చాలా మంది ఉద్యోగులను అక్రమంగా సస్పెండ్ చేయించి లిఫ్ట్ ఇవ్వకుండా వారి కుటుంబాలను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రిటైర్డ్ అయిన ఉద్యోగులకు సెటిల్‌మెంట్‌లు చేయడం లేదని, మహిళ ఉద్యోగులను సైతం ఇబ్బందులకు గురిచేస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. టీపీటీవోతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని ఎంపీ తమకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్, రీజనల్ కార్యదర్శి, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వీఎస్ఆర్ మూర్తి, ఏకే శివాజీ, గాజువాక కార్యదర్శి శంకరరావు, వాల్తేర్ కార్యదర్శి వసంతరావు పాల్గొన్నారు.

క్రీడా మైదానం పరిశీలన



ఏయూ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్

జగదాంబ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణకు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ విశ్వనాథన్ మంగళవారం ఆంధ్రా యూనివర్సిటీ క్రీడా మైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి, జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించారన్నారు. ఈ నెల 9 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించడానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు మహిళా క్రీడాకారిణులకు ఆంధ్రా యూనివర్సిటీ ఉమెన్స్ హాస్టల్లో ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. అలాగే మరుగుదొడ్లు కూడా ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఏఎంహెచ్‌వో రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రత అందరి బాధ్యత



హనుమంతవాక వద్ద ప్లకార్డులతో రవాణా శాఖ అధికారులు

ఆరిలోవ: రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రవాణా శాఖ అధికారులు మంగళవారం జాతీయ రహదారిపై హనుమంతవాక వద్ద వాహనచోదకులకు అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత పట్ల ప్లకార్డులు ప్రదర్శించారు. హెల్మెట్లు లేకుండా వాహనాలు నడిపేవారిని గుర్తించి వాటి ప్రాధాన్యత తెలియజేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖాధికారి ఐ.వేణుగోపాలరావు మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అని తెలిపారు. కార్లు నడిపేవారు సీటు బెల్ట్, ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్లు తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. మితిమీరిన వేగంతో నడిపిన వాహనచోదకులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు బుచ్చిరాజు, మన్మోహన్, మాధవి, రాజారావు, శిరీష, దేవి, సుమన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు సంరక్షణతో కూడిన విద్య అవసరం



అంబేద్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

మద్దిలపాలెం: అంగన్‌వాడీలో చదువుతున్న చిన్నారులకు సంరక్షణతో పాటు నాణ్యమైన విద్య ఎంతో అవసరమని విశాఖ అర్బన్–2 ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ వి.సెల్వియా అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు అంబేద్కర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) డేను కార్యకర్త ఈర్ల దేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్వి చిన్నారులు, వారి తల్లిదండ్రులకు ఫన్ యాక్టివిటీస్ నిర్వహించారు. రిమోట్ లెర్నింగ్ మెటీరియల్‌పై అవగాహన కల్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రీ స్కూల్ చిన్నారుల్లో సమగ్ర అభివృద్ధి పెంపొందించడం ఎంతో అవసరమన్నారు. ఇంటి వద్ద చిన్నారులకు విద్యపై ఆసక్తి కల్పించడానికి వీలుగా తల్లిదండ్రులకు చిన్నచిన్న బొమ్మల తయారీపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ సూచనలు, సలహాలను పాటించి చిన్నారుల్లో విద్యపై ఆసక్తి కల్పించేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలన్నారు. అనంతరం ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ప్రతినిధి వి.భారతి చిన్నారుల విద్యపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పాఠశాల హెచ్ఎం జి.నాగమణి, ఏఎన్ఎం శైలజ, ఎంఎస్‌కే విజయలక్ష్మి, ఆశా ఎం.చింతతల్లి, సహాయకురాలు పి.కనకదుర్గ పాల్గొన్నారు.

అలరించిన అన్నమాచార్య కీర్తనలు



వీణ కచేరీ ప్రదర్శన చేస్తున్న కళాకారిణులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో శ్రీఐశ్వర్యలక్ష్మీ సౌభాగ్య లక్ష్మీ సమేత వల్లభ వేంకటేశ్వర కల్యాణ ఉత్సవ ఆధ్యాత్మిక పీఠం వైభవోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వల్లభ వేంకటేశ్వర ఆధ్యాత్మిక పీఠం, వైదిక విజ్ఞాన విపంచి, విశాఖ సాగరతీర కార్తీక దీపోత్సవ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగనున్నాయి. మంగళవారం కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ వారి అన్నమాచార్య కీర్తనలు అందరినీ అలరించాయి. దీంతో పాటు వీణ కచేరి, తబల వాయిద్యం ప్రదర్శనలు మంత్రముగ్ధులను చేశాయి.

కేజీహెచ్ పిల్లల వార్డులో క్లినికల్ ల్యాబ్ ప్రారంభం



క్లినికల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట: కేజీహెచ్ పిల్లల వార్డులో రక్త పరీక్షల కోసం క్లినికల్ ల్యాబ్ మంగళవారం సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ప్రారంభించారు. గతంలో వివిధ రక్త పరీక్షల కోసం వార్డులో రోగుల పిల్లలను తీసుకు వెళ్లేవారు. కాని ఇక నుంచి వార్డులో అన్ని పరీక్షలు చేయడానికి వీలుగా ల్యాబ్ ఏర్పాటు చేశారు. అన్ని పరీక్షలు ఇక్కడే చేసి, ఇక్కడే రిపోర్టులు ఇస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల వార్డు విభాగాధిపతి డాక్టర్ బి.ఎస్.చక్రవర్తి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, ఆర్ఎంవో డాక్టర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు సినిమా ఉత్సవం



హెచ్.ఎం.రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో స్థానిక పౌర గ్రంథాలయంలో తెలుగు సినిమా ఉత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్త ప్రహ్లాద విడుదలై 92 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. ముఖ్యఅతిథిగా లయన్స్ పూర్వ జిల్లా గవర్నర్ ఆచార్య ఎన్.వి.ఎస్.దుర్గాప్రసాదరావు ఉత్సవాలను ప్రారంభించారు. ముందుగా భక్తప్రహ్లాద చిత్ర దర్శకుడు హెచ్.ఎం.రెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ చేయడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలు మంచి సినిమాలను చూసే సంస్కృతిని అలవాటు చేసుకోవాలన్నారు. కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ఫిల్మ్ సొసైటీ ప్రతి ఏడాది ఉత్సవాన్ని జరుపుతోందన్నారు. అనంతరం 1955లో విడుదల అయి సంచలనం సృష్టించిన బంగారు పాప చిత్రాన్ని ప్రదర్శించారు. 7వ తేదీ సాయంత్రం జయభేరి చిత్రం, 8న బలగం చిత్రాలను ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు చిన్నారావు, బాబ్జి, హుస్సేన్, చాట్ల బాబూరావు, రెడ్డి ఉషారాణి, అర్చన, కృష్ణారావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

నగరంలో పలు చోట్ల వాహనాల తనిఖీ





సిరిపురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: నగరంలో పలు చోట్ల పోలీసులు మంగళవారం రాత్రి విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్రధాన జంక్షన్లలో వాహనాలు ఆపి తనిఖీ చేశారు. వాహన రికార్డులు పరిశీలించారు. నగర పోలీసు కమిషనర్ రవిశంకర్ ఆదేశాలతో తనిఖీలు చేపడుతున్నారు.

అన్నప్రసాద పథకానికి రూ. 1.11లక్షల విరాళం



సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన పి.ఆనందరావు అనే దాత లక్ష 11వేల 116 రూపాయల విరాళాన్ని ఆలయ సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావుకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామి దర్శనం కల్పించారు. శేషవస్త్రం, ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అందజేశారు.

ఇళ్ల వద్దే ఓటు వేసే అవకాశం

ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి భాస్కరరెడ్డి



మాట్లాడుతున్న ఆర్‌డీవో భాస్కరరెడ్డి

భీమునిపట్నం: భీమిలి నియోజకవర్గ పరిధిలో నడవలేని స్థితిలో వున్న వృద్ధులు, వికలాంగులకు ఎన్నికల సంఘం తమ ఇళ్ల వద్దే ఓటు వేసే విధంగా అవకాశం కల్పిస్తోందని ఆర్‌డీవో, నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి ఎస్.భాస్కరరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో నడవలేని స్థితిలో ఉన్నవారు తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వేయాల్సిన పరిస్థితి ఉండేదని... ప్రస్తుతం ఆ ఇబ్బంది లేకుండా ఓటు వేసే అవకాశం లభిస్తోందన్నారు. నడవలేని స్థితిలో ఉండేవారు తమ వివరాలను అందిస్తే ఎన్నికల సిబ్బంది వారి ఇంటికి వెళ్లి ఓటు వేయిస్తారని... ఇది చాలా మంచి అవకాశమన్నారు. ఇటువంటి వారి వివరాలను బూత్ లెవల్ అధికారులు సేకరించాలని సూచించారు. ఈ విషయంలో నాయకులు తమకు సహకరించాలని కోరారు. అలాగే 18 సంవత్సరాలు నిండి ఇంకా ఓటర్లుగా నమోదు చేసుకోని వారు వెంటనే పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో అన్ని ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తున్నామని వెల్లడించారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



వేరుశనగ కాయల అలంకరణలో సంతపేట కొత్తమ్మతల్లి



కూరగాయల అలంకరణలో మజ్జివలస రాస పోలమాంబ



బంతిపూల అలంకరణలో తాటితూరు పైడితల్లమ్మ

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని మంగళవారం వేరుశనగ కాయల దండలు, తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో అలంకరణకు సరగడ రమణమ్మ, కళావతి సహాయ సహకారాలు అందించారు. అమ్మవారిని భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరెడ్డి అలంకరించారు. భీమిలి మండలం మజ్జివలస రాస పోలమాంబను నీలం, నలుపు వంకాయలు, ముల్లంగి, క్యారెట్‌లతో అలంకరించారు. అమ్మవారి అలంకరణ, ప్రసాదాల పంపిణీకి కృష్ణంరాజుపేటకు చెందిన డప్పు రాజారావు, రాజేశ్వరి దంపతులు సహాయ సహకారాలు అందించారు. తాటితూరు పైడితల్లమ్మను నిర్వాహకులు రెండు రకాల బంతిపూల దండలతో అలంకరించారు.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పెందుర్తి: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో డి.నీలవేణి ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి మండలం గొరపల్లి, చింతలగ్రహారం–1, సరిపల్లి–2, జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం–1, 64వ వార్డు గొడ్డువానిపాలెం, 77వ వార్డు చిన్నపాలెం, 97వ వార్డు నారవానిపాలెం, 76వ వార్డు కర్ణవానిపాలెం, 75వ వార్డు నెల్లిముక్కు, 85వ వార్డు పెదమడక, 74వ వార్డు దల్లివానిపాలెం కేంద్రాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

క్యూపీఆర్ విధానం పట్ల అవగాహన తప్పనిసరి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, క్యూపీఆర్ విధానం పట్ల విద్యార్థులకు మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆంధ్రా మెడికల్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ మన్మథరావు అన్నారు. వైద్య విద్యార్థుల కోసం మంగళవారం ఏఎంసీలో క్యూపీఆర్ (క్వశ్చన్ పర్సూ రిఫర్) గేట్ కీపర్ ట్రైనింగ్ సెషన్‌లో ఆయన వైద్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మహత్యల నివారణ, ప్రజల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో క్యూపీఆర్ గేట్ కీపర్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సైకియాట్రీ హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.